క్లుప్తంగా

కాంగ్రెస్‌ను బలపరుద్దాం



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్రలో పాల్గొని పార్టీని బలోపేతం చేద్దామని ఏపీపీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన కర్నూలు నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హాథ్ సే హాథ్ జోడో అభియాన్ యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు.

అదానీ అక్రమాలపై విచారణ జరపాలి

అదానీ అక్రమ వ్యాపార సంస్థలపై వెంటనే సీబీఐ విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేట్టారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలో ఎనిమిదిన్నర ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీ, ఎస్‌బీఐలను నిర్వీర్యం చేసి అదానీకి కట్టబెట్టేందుకు పూనుకోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్ పాల్గొన్నారు.

పారామెడికల్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు ఎర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, ఆర్. చిన్నరాముడు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చామన్నారు. శాంక్షన్ పోస్టుల్లో నిబంధనల ప్రకారం నియమితులైన పారామెడికల్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందన్నారు.

వాణిజ్య ప్రకటనల ఆదాయం వసూళ్లపై దృష్టి

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక శ్రీరామ థియేటర్ ఎస్‌వీసీ సినీ కాంప్లెక్స్‌లకు సంబంధించిన వాణిజ్య ప్రకటనల ఆదాయ వసూళ్లపై నగరపాలక అధికారులు దృష్టి సారించారు. సోమవారం పట్టణ ప్రణాళిక విభాగం అడిషనల్ సిటీ ప్లానర్ రంగస్వామి, హయత్ థియేటర్లను తనిఖీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 లోపు పెండింగ్ బకాయిలు చెల్లించాలని వాణిజ్య ప్రకటనల యజమానులకు సూచించారు.

టిడ్కో గృహాలు అప్పగించాలి

కర్నూలు(సెంట్రల్): టిడ్కో గృహాలను వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. సోమవారం టిడ్కో గృహ సముదాయం నుంచి కలెక్టరేట్ వరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నాకు దిగి ఇళ్లను అప్పజెప్పే వరకు పోరాటాలు ఆపమని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎన్ రసూల్, జగన్నాథం, నబీరసూల్, రాజాసాహెబ్, పంపన్నగౌడ్, రంగన్న, విరుపాక్షి, చంద్రశేఖర, శ్రీనివాసులు, మహేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున తరలి వచ్చి నిరసనకు దిగారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ..సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సెల్ టవర్లు లేకపోవడంతో ఫేస్ యాప్ ద్వారా హాజరును తీసుకోకూడదన్నారు. పదవి విరమణ చేసిన తరువాత ఇచ్చే బెనిఫిట్స్‌ను రూ.5 లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు రేణుకమ్మ, నాయకులు వెంకటమ్మ, పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్, వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, మైఖేల్, వారసుడు, రైటర్ పద్మభూషన్, బుట్ట బొమ్మ
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: వీర సింహారెడ్డి, మైఖేల్, వాల్తేరు వీరయ్య, వారసుడు,సువర్ణ సుందరి, రైటర్ పద్మభూషన్, బుట్ట బొమ్మ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, మైఖేల్, రైటర్ పద్మ భూషన్, బుట్ట బొమ్మ
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, పఠాన్, ది ఉమన్ కింగ్, రైటర్ పద్మభూషన్, రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం,పఠాన్, సువర్ణ సుందరి
భరత్ కాంప్లెక్స్ : రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం, పఠాన్, సువర్ణ సుందరి
రాజ్ : తెగింపు, బుట్ట బొమ్మ
శ్రీరామ : ప్రేమదేశం
విజయ : పఠాన్

జగనన్నకు తోడుగా ఉందాం



రావూరి గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని



హాజరైన గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, నాయకులు

- గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్ల శిక్షణలో ఎమ్మెల్యే కాటసాని
- టీడీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపు

కల్లూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడి రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కల్లూరు మండల పరిధిలోని గ్రామాల్లో ఎంపిక చేసిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రావూరి గార్డెన్‌లో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. వీటిని అర్హులకు అందిస్తూ పార్టీని బలోపేతం చేయడమే గృహ సారథులు, కన్వీనర్ల లక్ష్యమన్నారు.

టీడీపీ అసత్య ప్రచారాలను తిప్పికొడదాం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మేలు చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక దుష్ప్రచారం చేస్తున్నారని, దీనిని తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే కాటసాని పిలుపునిచ్చారు. కరోనాతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేకపోయినా సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌ది అన్నారు. రాష్ట్రంలో మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి కల్లూరు మండలం టీడీపీకి కంచుకోటగా ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అధిక ఎంపీటీసీ స్థానాలతో పాటు మండల అధ్యక్ష స్థానాన్ని పార్టీ గెలుచుకుందన్నారు. మూడున్నరేళ్ల పాలనలో మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కె.నాగలాపురం నుంచి వయా బస్తిపాడు, చిన్నటేకూరు మిదుగా నన్నూరు వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మించామన్నారు. సల్కాపురం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ నిధులతో పనులు చేపట్టామన్నారు. కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుంచి అనుగొండ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నంద్యాల జెడ్పీటీసీ గోకుల్ కృష్ణారెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లావెంకట రమణారెడ్డి, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు-2 చంద్రశేఖర్‌రెడ్డి, కర్నూలు నగర డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, మండల స్థాయి నాయకులు పెద్ద ఈశ్వరయ్య, సోమన్న యాదవ్, ఉలిందకొండ రమణారెడ్డి, కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నూతన ధర్మకర్త మండలికి దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని చెన్నకేశవ, ఆంజనేయ స్వాముల ఆలయాలకు నూతన ధర్మకర్త మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ కర్నూలు సహాయ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఏడుగురితో కూడిన మండలి నియామకానికి అర్హత ఉన్న అభ్యర్థులు తమ పూర్తి వివరాలను దరఖాస్తులో విధిగా పొందుపర్చాలని సూచించారు. ఆసక్తి ఉన్న సభ్యులు పూర్తి చేసిన దరఖాస్తును ఈ నెల 24వ తేదీలోగా సహాయ కమిషన్ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

కేసీ కెనాల్‌కు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 817 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు 720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, డ్యాంలో 0.813 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు.

11 నుంచి మౌలాలి ఉరుసు

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలోని దిన్నెదేవరపాడు కొండపై వెలసిన హజరత్ మౌలాలి సాహెబ్ ఉరుసు ఉత్సవాలు ఈ నెల 11 నుంచి ప్రారంభమవుతాయని ముతవల్లి పి.మౌలాలి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 11న రాత్రి గంధం, 12న కిస్తీ, ఖవాలి, 13న జియారత్ ఉంటుందన్నారు.

అప్పరభద్రకు వ్యతిరేకంగా పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లంమహేశ్వరరెడ్డి

- 13న కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన
- రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించిన రాజకీయ పార్టీలు

కర్నూలు(సెంట్రల్): కర్ణాటక ప్రభుత్వం నిర్మించనున్న అప్పరభద్ర ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ పోరాటాలు చేయాలని, ఈ నెల 13 కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. సోమవారం కార్మిక,కర్షక భవన్‌లో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో అప్పరభద్ర ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ..అప్పర భద్ర ప్రాజెక్టు నిర్మితమైతే రాయలసీమ ఎడారి అవుతుందన్నారు. కేసీకెనాల్, ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీలకు చుక్క నీరు రాదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ రాజకీయ స్వార్థం కోసం ప్రాజెక్టుకు జాతీయ హోదాను ప్రకటించి రూ.5,300 కోట్లను కేటాయించడం అన్యాయమన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కరువుకు నిలయమైన రాయలసీమ నోట్లో మట్టికొట్టేందుకు బీజేపీ సర్కారు అప్పరభద్ర ప్రాజెక్టు చేపడుతుందని మండిపడ్డారు. ఆర్థిక వేత్త మన్సూర్ రెహమాన్ మాట్లాడుతూ.. సాంకేతిక అనుమతులు లేకుండానే అప్పరభద్రను నిర్మించేందుకు కర్ణాటక ముందుకురావడం అన్యాయమన్నారు. ఇప్పటికే తుంగభద్ర జలాల్లో ఏపీ వాటా నీటిని కర్ణాటక రైతులు చౌర్యం చేస్తున్నారన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ.. అప్పరభద్ర డ్యామ్‌పై ఏపీలోని బీజేపీ నేతలు మౌనం దాల్చడం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పుట్టగతులు ఉండవన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బి.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ..బీజేపీ స్వార్థ రాజకీయాల కోసం ఇలాంటి ప్రయత్నాలు చేస్తోందన్నారు. అప్పర భద్ర ప్రాజెక్టుకు వైఎస్ఆర్‌సీపీ వ్యతిరేకమని, ప్రభుత్వం పరంగా న్యాయ పోరాటానికి ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, జనసేన నాయకులు హర్షద్, కాంగ్రెస్ నాయకులు పోతులశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి.రామకృష్ణ, కేవీ నారాయణ పాల్గొన్నారు.

కో-ఆపరేటివ్ ఆడిట్ ఆఫీస్ అటెండర్ ఆత్మహత్య



పెరుమాళ్ల జ్యోతి కుమారి (ఫైల్)

కర్నూలు: కర్నూలు కృష్ణానగర్‌లోని కో-ఆపరేటివ్ ఆడిట్ ఆఫీస్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న పెరుమాళ్ల జ్యోతికుమారి (54) కేసీ కెనాల్‌లో పడి ఆత్మహత్య చేసుకుంది. భర్త సామన్న కొన్నేళ్ల క్రితం చనిపోవడంతో కుమారుడు రాజశేఖర్‌తో కలసి నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సనత్ నగర్‌లో ఉంటోంది. ఈమె కొన్నేళ్లుగా మూత్రనాళానికి సంబంధించిన జబ్బుతో బాధపడతుండేది. సోమవారం ఉదయం ఆసుపత్రికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి బయటకు వచ్చింది. అయ్యప్పస్వామి గుడి దగ్గర కేసీ కెనాల్ నీటిలో మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మూడో పట్టణ బ్లూ కోల్ట్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీసి ఆమె ఫొటోను పోలీస్ వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. జ్యోతికుమారి కుమారుడు రాజశేఖర్‌తో పాటు బంధువులు గుర్తించి సాయంత్రం స్టేషన్‌కు వెళ్లి అనారోగ్యం బాధ తాళలేకనే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేశారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకుడిపై కేసు నమోదు

కర్నూలు (న్యూటౌన్): మహారాష్ట్రలోని పూనేకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకుడు శ్రీకాంత్ మీద కర్నూలు రెండో పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. గతేడాది ఏప్రిల్‌లో ఓ సర్వేకు సంబంధించి సాఫ్ట్‌వేర్ తయారు చేసి ఇచ్చేందుకు రూ.2లక్షలు అడ్వాన్స్ తీసుకుని సదరు వ్యక్తి మోసగించినట్లు కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సింగరి సంజీవ్ కుమార్ సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు వెల్లడించారు.

వేతనాలు అందక ఇబ్బందులు

కర్నూలు సిటీ: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ప్రతి నెలా 1వ తేదీన జీతాలు, పింఛన్లు అందక ఇబ్బందులు పడుతున్నారని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న అన్నారు. సోమవారం ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం సలాంఖాన్ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సంఘం రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ సయ్యద్ ముదసిర్ అహ్మద్, సుధీర్, రఫీ, రహీం, తదితరులు పాల్గొన్నారు.

చారిత్రాత్మక ప్రదేశాలకు సిల్వర్‌జూబ్లీ విద్యార్థులు

కర్నూలు సిటీ: సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీకి చెందిన విద్యార్థులు విద్య, చారిత్రాత్మక ప్రదేశాల సందర్శనకు సోమవారం బయలుదేరి వెళ్లారు. క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ డా.వి.వి.ఎస్. కుమార్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కాలేజీలో హెచ్ఈపీ, పర్యాటక విద్యార్థులు ఈ నెల 13వ తేదీ వరకు ఢిల్లీ, ఆగ్రా తదితర ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. మొత్తం 95 మంది విద్యార్థులు, 6 మంది అధ్యాపకులు వెళ్లారన్నారు.

కేవీఆర్ అధ్యాపకురాలికి డాక్టరేట్



విష్ణు వందన

కర్నూలు కల్చరల్: కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలు కొలిశెట్టి విష్ణు వందన డాక్టరేట్ పొందారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా శాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపా రు. విష్ణు వందన 'సిగ్నిఫికేషన్ ఆఫ్ మిషిన్ లెర్నింగ్ టెక్నిక్స్ ఇన్ బిగ్ డేటా అనాలసిస్ ఫర్ డేటా ఇంటిగ్రేషన్ ఎన్హాన్స్ మెంట్' అనే అంశంపై వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్వ విద్యాలయం నుంచి ఆచార్య ధర్మేంద్ర సింగ్ రాజ్ పూత్ మార్గదర్శనంలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ నేపథ్యంలో విష్ణు వందనకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ

కర్నూలు (టౌన్): నగరంలోని 25 వ వార్డు దేవనగర్‌లో పారిశుద్ధ్య పనులను సోమవారం నగరపాలక డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమాదేవి తనిఖీ చేశారు. స్థానిక కార్పొరేటర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు సిత్రా సత్యనారాయణమ్మ, స్థానిక నాయకులు గడ్డం రామకృష్ణతో కలిసి పారిశుద్ధ్యంపై ఫిర్యాదు చేసిన కాలనీల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బిర్లాగడ్డ, గాయత్రీ ఎస్టేట్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి సూచించారు.

వినతులకు సత్వర పరిష్కారం

- స్పందనలో కమిషనర్ భార్గవ్‌తేజ



స్పందనలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): ప్రజా వినతులకు సత్వర పరిష్కారం చూపుతామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందనలో కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొని వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మున్సిపల్ ఎస్ఈ శేషసాయి, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- నగరంలోని రోజా వీధి, శ్రీరామనగర్, వాసవినగర్‌లలో రోడ్లను ఆక్రమించడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఆయా కాలనీలకు చెందిన స్థానికులు రామస్వామి, శివప్రసాద్, హీరాలాల్ కమిషనర్‌కు విన్నవించారు.
- లక్ష్మీనగర్‌లో మ్యాన్ హోల్ తెరుచుకుందని, ప్రమాదం జరగకముందే దానిని మూసివేయాలని భాస్కర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.
- తమ కాలనీల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థలు సరిగ్గా లేవని, వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పార్థసారధి నగర్‌కు చెందిన రాజగోపాల్, టెలికాం నగర్‌కు చెందిన యాకోబ్ విన్నవించారు.
- తమ కాలనీలో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని తుంగభద్ర కాలనీకి చెందిన రవికాంత్ అభ్యర్థించారు.

బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకో

- హవిలన్ బాబుకు సీసీ చర్చి కమిటీ హెచ్చరిక



మాట్లాడుతున్న సీసీ చర్చి అధ్యక్షుడు ప్రభుదాస్

కర్నూలు (టౌన్): ఎంతో చరిత్ర ఉన్న నగరంలోని కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి పరువును బజారు కీడిస్తే తీవ్రం పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆ చర్చి అధ్యక్ష, కార్యదర్శులు ప్రభుదాసు, ఆర్.అనిల్‌నాథ్ హవిలన్ బాబును హెచ్చరించారు. చర్చి సభ్యుడిగా ఉన్న హవిలన్‌బాబును తొలగించారు. అయినా, అతను బ్లాక్ మెయిల్ రాజకీయాలు మానుకోవడం లేదన్నారు. అయనపై పరువు నష్టం దావా వేస్తున్నట్లు వెల్లడించారు. సోమవారం స్థానిక పాతబస్టాండ్‌లోని కోల్స్ చర్చి కమిటీ సభ్యుల సమావేశ హాలులో వారు మాట్లాడారు. ఏలాంటి ఆధారాలు లేకుండా కోల్స్ చర్చిలో రూ. 4 కోట్లు దుర్వినియోగం చేస్తున్నారని ఆయన చెప్పడం సమంజసం కాదన్నారు. నిజంగా ఆధారాలు ఉంటే చూపించాలన్నారు. ఏదో ఆశించి కోల్స్ చర్చి సభ్యులను బెదిరించేందుకు చూస్తున్నారన్నారు. చర్చికి పెట్టిన ప్రతిపైసాకు లెక్క ఉందన్నారు. సమావేశంలో చర్చి సభ్యులు, ప్రాపర్టీ కమిటీ సభ్యులు సుధీర్‌కుమార్, ప్రభాకర్, అబ్షలోమ్‌రాజు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పెర్సీస్ బ్యాంకిన్ పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో మెరుగైన వైద్యసేవలందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): సామాజిక ఆరోగ్య అధికారులు గ్రామస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. ప్రాంతీయ శిక్షణ కేంద్రం (ఫిమేల్)లో జరుగుతున్న సామాజిక ఆరోగ్య అధికారుల రెండో విడత శిక్షణ కార్యక్రమంలో సోమవారం డీఎంహెచ్‌వో పాల్గొని ప్రసంగించారు. సీహెచ్ఓలు ఈ శిక్షణ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని, గ్రామస్థాయిలో ఫ్యామిలి ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో పాల్గొని ప్రజలతో మమేకమై సమగ్ర సేవలందించాలని సూచించారు. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ పరిధిలో ప్రజలందరి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వారికి ఎప్పటికప్పుడు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. మాతృ మరణాల నివారణ కోసం గర్భిణులను త్వరగా నమోదు చేసి, వారికి సమయానుసారంగా ఆరోగ్యసేవలు అందించి, వారిలో ప్రమాదకర చిహ్నాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రులకు పంపించాలన్నారు. కాన్పునకు 3 రోజుల ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేర్పించి సుఖప్రసవం అయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఎంయూ డాక్టర్ ఉమ, డాక్టర్ చంద్రకాంత్ యాదవ్, డాక్టర్ మారుతిప్రసాద్, డాక్టర్ రజని, డాక్టర్ సుష్మిత, డీపీఓ విజయరాజు పాల్గొన్నారు.

10 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎమ్) ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తలారి సుధాకర్ వెల్లడించారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా యువతను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో 10 నుంచి 12 వ తేదీ వరకు మూడు రోజుల పాటు మొదటి సారి జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఓపెన్ కేటగిరీ మెన్స్ పోటీలకు సంబంధించి మొదటి బహుమతి, రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15, మూడో బహుమతి రూ.10, నాలుగో బహుమతి రూ.5 వేలు, ఓపెన్ కేటగిరి ఉమెన్స్ మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ. 5, మూడో బహుమతి రూ. 3, నాలుగో బహుమతి రూ. 2 వేలు, జూనియర్ బాలురు (70కేజీల లోపు, 18 సంవత్సరాల లోపు) మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.8, మూడో బహుమతి రూ.5వేలు, నాలుగో బహుమతి రూ. 3వేలు అందజేస్తామన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 9వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు జట్టు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో బీజేవైఎమ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ ఆచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు శివ పాల్గొన్నారు.

షూటింగ్ బాల్‌లో సత్తాచాటాలి

కర్నూలు (టౌన్): ఈనెల 10 నుంచి 13 వరకు కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో నిర్వహించే స్త్రీ, పురుషుల 41 వ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటాలని జిల్లా ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి అవినాష్ అన్నారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో షూటింగ్ బాల్‌లో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ క్రీడాకారులు అంకితభావంతో సాధన చేసి రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా షూటింగ్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు, నరేష్, నాగరాజు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ విజేత ఆర్‌యూ జట్టుకు వీసీ అభినందన

కర్నూలు (టౌన్): గత ఐదు రోజులుగా హోరాహోరీగా సాగిన సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్ ఫైనల్ పోటీల్లో విన్నర్‌గా నిలిచిన రాయలసీమ యూనివర్సిటీ జట్టుకు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆనందరావు అభినందించారు. సోమవారం స్థానిక ఆ వర్సిటీలో జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందర్రానంద్, యూనివర్సిటీ క్రీడల కోఆర్డినేటర్ డాక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



ట్రోఫీ అందజేసి అభినందిస్తున్న ఆర్‌యూ వైస్‌చాన్స్‌లర్ ఆనందరావు

క్రీడల అభివృద్ధికి ప్రోత్సాహం



విజేత దుర్గా ఎలెవెన్ టీమ్‌కు ట్రోఫీ అందజేస్తున్న మైపర్ విద్యాసంస్థల అధినేత సతీష్

- మైపర్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఆదిమూలపు సతీష్
- ముగిసిన ఓపెన్ హార్డ్ టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్
- విజేతకు ట్రోఫీ, బహుమతి అందజేత

కర్నూలు(టౌన్): క్రీడల అభివృద్ధికి తనవంతు ప్రోత్సాహం అందిస్తానని మైపర్ సంస్థల అధినేత డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. స్థానిక జొహరాపురం రోడ్డులో ఉన్న మైపర్ టెన్నిస్, క్రికెట్ అకాడమీ క్రీడా ప్రాంగణంలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న ఓపెన్ హార్డ్ టెన్నిస్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. మొత్తం 54 టీమ్‌లు పాల్గొన్న ఈ పోటీల్లో దుర్గా ఎలెవెన్ టీమ్ విన్నర్‌గా నిలిచి ట్రోఫీతో పాటు రూ.50 వేలు నగదు బహుమతి గెలుచుకోంది. రన్నర్‌గా కోడుమూరు టీమ్ నిలిచి రూ.25 వేలు,మెమొంటో అందుకుంది. బహుమతుల ప్రదానోత్సవానికి ముందు థెరీసమ్మ జ్ఞాపకార్థం భారీ కేక్ కట్ చేసి రెండు నిముషాలు మౌనం పాటించారు.అనంతరం సతీష్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే పూర్తి స్థాయి సదుపాయాలతో మైపర్ టెన్నిస్, క్రికెట్ క్రీడా ప్రాంగణాలను 8 ఎకరాల్లో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాత్రివేళల్లో ఆడేందుకు ఫ్లడ్ లైట్లు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్రీడాకారులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. ఓపెన్ హార్డ్ టెన్నిస్ క్రికెట్ పోటీలకు స్పాన్సర్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నగర అధ్యక్షుడు రాజా విష్ణువర్ధన్‌రెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో మైపర్ సంస్థల ప్రిన్సిపాల్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, కోచ్ శివచరణ్, పీడీ హరిచరణ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.